


# రొమ్ము కొట్టుకొనుట

ఆదరణనిచ్చు యేసయ్య నామమునకు మహిమ కలుగును గాక!

**మూలవాక్యము :- Luke(లూకా సువార్త) 23:27** గొప్ప జనసమూహమును, **ఆయనను గూర్చి రొమ్ముకొట్టు కొనుచు దుఃఖించుచున్న చాలమంది స్త్రీలును ఆయనను వెంబడించిరి.**

ప్రస్తుతము ప్రపంచములో దయనీయమైన పరిస్థితి ఒక్క సిరియా దేశంలోనే చూడవచ్చు. ప్రతి రోజు ఆహారము లేక, నీరు లేక,వసతులు లేక వేలాది మంది చనిపోతున్నారు. తరలిపోతున్నారు. ఒక ప్రక్క అంతర్యుద్ధము, మరో ప్రక్క తప్పించుకొని పారిపోతూ మృత్యు కౌగిలిలోనికి వెళ్లి పోతున్నారు. తెప్పల పైన వేరే దేశాలకు పారిపోవడానికి ప్రయత్నము చేసి నీట మునిగి శవాలై సముద్ర తీరంలో తేలుతున్నారు. ఎక్కడ చూసినా తల్లులు రొమ్ములు కొట్టుకొనుచు రోదించడం మనం గమనించగలం. అన్నీ వున్న వారికి రొమ్ము కొట్టుకోవలసిన అగత్యము లేదు. సర్వం కోల్పోయిన వారికి రొమ్ము కొట్టుకొని రోదించడం తప్ప మరో మార్గం లేదు. ఇది చదువుతున్న మీలో ఏ ఒక్కరికి రొమ్ము కొట్టుకొని విలపించే పరిస్థితి గాని, అవసరము గాని నేటి వరకు వచ్చి ఉండదని విశ్వసిస్తున్నాను.

కెనెడా ప్రధానమంత్రి Rt. Hon. Justin Trudeau(జస్టిస్ ట్రూడో) గారు, 25 వేల మంది సిరియా శరణార్థులను ఎలాంటి షరతులు లేకుండా మొదటి రోజు నుండే ఆ దేశ పౌరులుగా హక్కు కల్పించి అన్ని వసతులు ఏర్పాటు చేశారు. ఇస్లామిక్ దేశాలన్ని చోద్యం చూస్తుంటే ఒక క్రైస్తవుడు క్రీస్తు ప్రేమను ప్రపంచానికి చాటి చెప్పాడు. ఈ రొమ్ము కొట్టుకొనుట అర్థం కావాలంటే ఒక్కసారి ఆ సిరియా దేశపు వీడియోలు చూడవలసినదిగా మనవి చేస్తున్నాను. మనమైతే రొమ్ము కొట్టుకొనుటను గురించి పరిశుద్ధ గ్రంథం ఏమి నేర్పిస్తుందో జాగ్రత్తగా పరిశీలిద్దాం.

1. **చనిపోయిన వారి నిమిత్తము రొమ్ము కొట్టుకొనుట : Luke(లూకా సువార్త) 8:51** **అందరును ఆమె నిమిత్తమై యేడ్చుచు రొమ్ము కొట్టుకొనుచుండగా,** ఆయన వారితో
2. **కష్టపడి పండించిన పంట చేతికి వచ్చే సమయంలో శత్రువులు దానిని పాడు చేసినప్పుడు రొమ్ము కొట్టుకొనుట : Isaiah(యెషయా గ్రంథము) 32:12** **రమ్యమైన పొలము విషయమై ఫలభరితమైన ద్రాక్షా వల్లుల విషయమై వారు రొమ్ము కొట్టుకొందురు.**
3. **యేసుక్రీస్తుకు జరిగిన కార్యములు(అన్యాయము) చూచి ప్రజలందరు రొమ్ము కొట్టుకొనుట : Luke(లూకా సువార్త) 23:48** **చూచుటకై కూడివచ్చిన ప్రజలందరు జరిగిన కార్యములు చూచి, రొమ్ము కొట్టుకొనుచు తిరిగి వెళ్లిరి.**




4. **పట్టణములు పాడు చేయబడినప్పుడు రొమ్ము కొట్టుకొనుట : నహూము 2:7** నిర్ణయమాయెను, అది దిగంబరమై కొనిపోబడుచున్నది, గువ్వలు మూల్గునట్లు దాని దాసీలు రొమ్ము కొట్టు కొనుచు మూల్గుచున్నారు. **ప్రకటన18:10** దాని విషయమై రొమ్ము కొట్టుకొనుచు ఏడ్చుచు--అయ్యో అయ్యో, బబులోను మహాపట్టణమా, బలమైన పట్టణమా, ఒక్క గడియలోనే నీకు తీర్పువచ్చెను గదా అని చెప్పుకొందురు.

**అంత్యదినములలో లయకర్త అయిన దేవుడు తన ఉగ్రత చేత నీనెవె, బబులోను పట్టణములను పాడు చేసినప్పుడు ఆ పట్టణముల వారు రొమ్ము కొట్టుకొని మూల్గులిడుచు రోదించెదరు.**

5. **రొమ్ము కొట్టుకొనుట చిన్న పిల్లలు ఆడుకునే ఒక ఆట : Matthew(మత్తయి సువార్త) 11:17** మీకు పిల్లనగ్రోవి ఊదితిమిగాని మీరు నాట్యమాడరైతిరి; **ప్రలాపించితిమి గాని మీరు రొమ్ముకొట్టుకొనరైతిరని** తమ చెలికాండ్రతో చెప్పి పిలుపులాటలాడుకొను పిల్ల కాయలను పోలియున్నారు

**ALERT :-**

1. **పాపములు ఒప్పుకొనుటకు రొమ్ము కొట్టుకొనుట : Luke(లూకా సువార్త) 18:13 అయితే సుంకరి దూరముగా నిలుచుండి, ఆకాశమువైపు కన్ను లెత్తుటకైనను ధైర్యముచాలక రొమ్ము కొట్టుకొనుచుదేవా,** పాపినైన నన్ను కరుణించుమని పలికెను.
2. **యేసుక్రీస్తు రెండవ రాకడలో వచ్చునప్పుడు**
   - **భూమి మీద నున్న సకల గోత్రముల వారు రొమ్ము కొట్టుకొనుట : Matthew(మత్తయి సువార్త) 24:30** అప్పుడు మనుష్యకుమారుని సూచన ఆకాశమందు కనబడును. **అప్పుడు మనుష్య కుమారుడు ప్రభావముతోను మహా మహిమతోను ఆకాశమేఘారూఢుడై వచ్చుట చూచి, భూమిమీదనున్న సకల గోత్రములవారు రొమ్ము కొట్టుకొందురు.**
   - **భూజనులందరు ఆయనను చూచి రొమ్ము కొట్టుకొనుట : Revelation(ప్రకటన గ్రంథము) 1:7 ఇదిగో ఆయన మేఘారూఢుడై వచ్చుచున్నాడు; ప్రతి నేత్రము ఆయనను చూచును, ఆయనను పొడిచినవారును చూచెదరు; భూజనులందరు ఆయనను చూచి రొమ్ము కొట్టుకొందురు; అవును ఆమేన్.**

**ఈ Lent దినాలలో చాలా మంది యేసయ్య శ్రమల కాల ధ్యానాలు చేస్తున్నప్పుడు ఆయన పొందిన మహా శ్రమలను జ్ఞాపకము చేసికొని ఏడుస్తూ వుంటారు. అయితే యేసయ్య నా నిమిత్తము ఏడ్వకుడి, మీ నిమిత్తము మీ పిల్లల నిమిత్తము ఏడ్వండి అని చెప్పారు. అవును ప్రియులారా మనము మన పాపముల నిమిత్తము, మన పిల్లల పాపముల నిమిత్తము మన పితరుల పాపముల నిమిత్తము రొమ్ము కొట్టుకొనుచు దేవుని సన్నిధిలో ఒప్పుకోలు చేసుకోవాలి.**




నీవు ఆరోగ్యంగా ఉండి రొమ్ము కొట్టుకొనగలిగిన స్థితిలో ఉంటేనే. లేని పక్షంలో నీ స్థితిని దేవునికి అప్పజెప్పుకో, రొమ్ము కొట్టుకున్నంత క్షమాపణ ప్రభువు ఇస్తారు. ఈ lent లో రొమ్ము కొట్టుకొనుచు మన పాపములు ఒప్పుకునే అనుభవంలోకి వచ్చి ప్రభువు రాకడ కొరకు మనము సిద్ధపడుదాం.అలా చేయకపొతే యేసయ్య రెండవ రాకడలో ఆయనను చూచి దిగులుతో, భయముతో రొమ్ము కొట్టుకోవలసి వస్తుంది.అప్పుడు రొమ్ము కొట్టుకొని విలపించినా ప్రయోజనమేమి వుండదు.

నీ పాపముల నిమిత్తమై నీవు పశ్చాత్తాపపడి, రొమ్ము కొట్టుకొని యేసు రక్తం నీ పాపములకు ప్రాయశ్చిత్తం అని నమ్మి, ఒప్పుకున్న తరువాత నీకు పాపక్షమాపణ దొరుకుతుంది. అంతే కాని పాపాలు ఒప్పుకోకుండా, కప్పుకుంటూ, యేసు రక్తం నన్ను విడుదల చేస్తుంది అంటే నిన్ను నీవు మోసపుచ్చుకుంటున్నావు.

నీ పాపములకై ఎప్పుడైనా పశ్చాత్తాపపడ్డావా? ఏడ్చావా? దేవుని సన్నిదిలో మోకరిల్లి ప్రాధేయపడ్డావా?   ఆయన నీ కోసం చేసిన ఆ బలియాగం నీకు అర్థం అయ్యిందా. అది అర్థం చేసుకొని పశ్చాత్తాపడటానికే Lent.ఈ 40 రోజులు దైవసేవకులు నీకు వివరంగా బోధిస్తుంటే అప్పుడు నీకు పాపం గురించి పశ్చాత్తాపం గురించి రక్షణ గురించి అర్థమవుతుంది. ఇంత గొప్ప రక్షణ ప్రణాళికను అర్థం చేసుకోడానికి 40 రోజుల ఉపవాసం నీకు అంత కష్టమా? దానిని ఎగతాళి చేస్తావా? ఈ పరిశుద్ధ సమాయాన్ని,సిద్ధపాటును, ఆచారం అని కొట్టివేస్తావా? నీవు చేయకపోతే మానేయ్. ఇతరులను ఆ సిద్ధపాటులో నుండి వెనక్కిలాగకు, రెండంతలు నరకపాత్రుడివి అవుతావు జాగ్రత్త. ఇలాంటి పొరపాటు చేయకుండా ఈ lent లో రొమ్ముకొట్టుకొనుచు పాపములు ఒప్పుకునే అనుభవము పరిశుద్ధాత్మ దేవుడు మనకందరికి అనుగ్రహించును గాక... ఆమెన్ ..ఆమెన్.. ఆమెన్.